

పగలే వెన్నెల..!

పట్టించుకోని పంచాయతీ అధికారులు
వృధా అవుతున్న విద్యుత్



ప్రజాశక్తి-బంగారుపాల్యం
మండలంలోని తుంబుకుప్పం గ్రామంలో రాత్రుల్లో వెలగాల్సిన వీధి దీపాలు పగలంతా వెలుగుతున్నాయి.. ఊరు మొత్తానికి కలిపి దాదాపు 50, 60 వీధి దీపాలు నిరంతరం వెలగడం వలన విద్యుత్తు వృధా అవుతున్నా ఆ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదు. గ్రామంలోని ఏ వీధిలో చూసిన విద్యుత్ దీపాలు పగలంతా వెలుగుతూనే ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు మాత్రం నిమ్మకు నీరుఎత్తినట్టు వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వీధి దీపాలను పగటి పూట ఆపి విద్యుత్ వృధాను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి ఎద్దడిని గుర్తించండి: కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
రానున్న వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు పూర్తి సమాచారంతో నివేదికలను సోమవారం సాయంత్రం లోపల తయారు చేసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎంపీడీఓలు, పిఓఆర్డీలు, సంబంధింత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలతో పాటు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉన్నదని ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ గ్రామానికి సంబంధించి కూడా నీటి సరఫరాలో ఇబ్బందులు ఉండకూడదని ఆ విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి కొన్ని గ్రామాలలో కొంత సమస్యలు ఉన్నాయని సరఫరా చేస్తున్న వ్యవస్థలను గుర్తించి హ్యాబిటేషన్ల వారీగా ఉన్న వనరులను, ఆ వనరుల ద్వారా లభ్యమవుతున్న నీరు, షార్టేజ్ వివరాలు పరిశీలించి నివేదికలు ఇవ్వాలని అన్నారు. ప్రధానంగా పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాలలోని కొన్ని ప్రాంతాలలో నీటి సరఫరాలో కొంత ఇబ్బందులు ఉంటున్నాయని గుర్తించడం జరిగిందని అయితే ఆ ఇబ్బందులను అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి కూడా ఈ నివేదికలో పొందుపరచాలని అన్నారు. ట్రాన్స్‌పోర్టేషన్ అనుమతించబడదని పక్కన ఉన్న బోర్లను అవసరమైతే తాత్కాలికంగా తీసుకొని నీటిని సరఫరా చేసే విధంగా చూడాలన్నారు. ఇటీవల కాలంలో నాడు- నేడు కార్యక్రమాలు పూర్తి చేసుకున్న పాఠశాలలు కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో కూడా బోర్లు ఉన్నాయని అవసరమైతే వాటిని కూడా ఉపయోగించుకునేలా ప్రణాళికలో రూపొందించాలని అన్నారు. పబ్లిక్ వనరులకు సంబంధించి మొదట ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి పరిశీలించాలన్నారు. బోర్ మెకానిక్‌లు లేని మండలాలలో వెంటనే నియమించుకోవాలని, మండలంలో 250కి పైగా బోర్లు ఉండి ఉంటే మరో మెకానిక్‌ను నియమించుకోవాలన్నారు. ఏవైనా మెటీరియల్స్ అవసరం అయితే వాటిని గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ఇరిగేషన్ చెరువులలోని నీటిని పశువులకు ఉపయోగించుకోవచ్చు అన్నారు. ఈ నివేదికలు తహశీల్దార్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఏఈ ఆర్డబ్ల్యూఎస్, ఏఈఎస్ పిడిసిఎల్ సభ్యులుగా నివేదిక ఇవ్వాలన్నారు. అదేవిధంగా పై సభ్యులు వోల్టా యాక్ట్ అమలు అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నడక దారిలో చిరుత సంచారం

సిసి కెమెరాలకు చిక్కిన చిరుత విన్యాసాలు



ప్రజాశక్తి- తిరుమల
తిరుమల నడకదారి సమీపంలో మరోసారి వన్యమృగాల సంచారం తీవ్ర కలకలం సృష్టిస్తుంది. మెట్ల మార్గానికి సమీపంలో చిరుతతో పాటు ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నడకదారికి సుమారు 150 మీటర్ల దూరంలోనే చిరుత, ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. గత రెండు రోజులుగా రాత్రి సమయాల్లో ఇవి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు రాత్రి సమయాల్లో భక్తులను గుంపులుగా వెళ్లేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అయినప్పటికీ మరోసారి చిరుత, ఎలుగుబంటి సంచారం నేపథ్యంలో భక్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

శ్రీవారి ఆలయంలో

2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 9న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 2వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 2న ఉదయం 6 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉపఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఈవిఎం గోడౌన్ పరిశీలన


ఈవీఎం గోడౌన్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈవిఎం గోడౌన్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ పరిశీలించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణంలోని ఈవిఎం గోడౌన్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, డిఆర్ఓ బి.పుల్లయ్యలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్‌లను, స్ట్రాంగ్ రూమును ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పరిశీలించడం జరుగుతుందని, ఈ స్ట్రాంగ్ రూంను ఇలాగే కొనసాగిస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించడం జరిగిందన్నారు. సాధారణ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా మే 13వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పది రోజులు ముందుగా ఈవీఎంలను పోలీస్ బందోబస్తు మధ్య నియోజకవర్గ స్థాయిలో స్ట్రాంగ్ రూములకు తరలించి మే 9వ తేదీన ఈవీఎంలను మరోమారు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా ఎన్నికల సన్నద్ధతకు ముందస్తుగా సమాయత్తం కావడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి అట్లూరి శ్రీనివాస్, సిపిఎం వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ భాస్కర్, టిడిపి సురేంద్ర కుమార్, వైఎస్ఆర్‌సిపి ఉదయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



గొంతెండుతోంది..

- తప్పని నీటి కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- పెరిగిన ఎండలు, ఎండిన చెరువులు
- దాహంతో అల్లాడుతున్న జీవాలు
- నీటి వనరులను విస్మరించిన పాలకులు

ప్రజాశక్తి- వికోట


తీవ్ర వర్షాభావ పరిస్థితులలో మండలంలో తాగునీటికి ప్రజలు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చెరువులు, బావులు, బోరు బావులపై ఆధారపడే ఈ ప్రాంత ప్రజలు జీవిస్తున్నారు. అయితే గత సంవత్సరం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగు, సాగు నీటికి రైతులు, ప్రజలు తీవ్రఅవస్థలు ఎదుర్కొంటున్నారు.

పెరిగిన ఎండలు ఎండుతున్న చెరువులు..
పర్యావరణం దెబ్బతినడం, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి అడవులు అంతరించిపోవడం వర్షాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణం. ఇటీవల మండలంలో ఎండల తీవ్రత అధికం కావడంతో దాదాపు చెరువులలో నీళ్లు లేక బీటలు వారుతున్నాయి. మండల పరిధిలో 126 చిన్న, పెద్ద చెరువులు ఉన్నాయి. వీటిలో వీకోట, కీళపల్లి, పెద్దచెరువు కింద ఆయనకట్టగా 128.35 ఎకరాలు, బైరుపల్లి చెరువు 56 ఎకరాలు, ఎల్లాగరం చెరువు 45 ఎకరాల్లో మండలంలోనే పెద్ద చెరువులుగా పేరెన్నిక గన్నాయి. అయితే వీకోట కీలపల్లి చెరువులో మినహా మిగిలిన చెరువుల్లో నీరు ఇంకిపోయింది. మండలంలోని చిన్నాచితక కుంటల్లోని అరాకొర నీటి వనరులు కూడా రాబోయే రోజుల్లో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో బావులు, బోరు బావుల్లో నీటి మట్టాలు అడుగంటి పోయాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు లోతుకు వెళ్లడంతో అదనపు పైపులు వేయడం వలన బోరు మోటర్లు కాలిపోతున్నాయి. దీంతో పంటలు ఎండి ఖర్చులు పెరిగి రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు.

గ్రామాల్లో మొదలైన తాగునీటి కష్టాలు..
బోరుబావుల్లో నీరు అడుగంటిపోవడంతో అరకొరాగా వచ్చే నీరు సరిపోక గ్రామీణ ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా బోరు మోటర్లు కాలిపోతున్న ప్రాంతాల్లో పశు పోషణపై ఆధారపడిన పాడిరైతులు జీవాల దాహం తీర్చడానికి నానా అవస్థలు పడుతున్నారు. పొలాల్లో రైతులు అరాకొర నీటిని డ్రిప్ ద్వారా పంటలకు మళ్లించడంతో నీళ్లు కనబడే పరిస్థితి లేకపోతోంది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు.

నీటి వనరులను విస్మరించిన పాలకులు...
మండలపరిధిలో ప్రజలు పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. మండలంలో ప్రధానంగా ప్రవహించే పాలారు నదిపై సక్రమంగా చెక్ డ్యాంలు నిర్మించలేకపోవడం, ఉన్న వాటిని అక్రమ ఇసుక వ్యాపారులు పాడు చేయడంతో నీటి నిల్వలు లేకుండాపోతున్నాయి. మండలంలో తాగు, సాగునీటి పరిష్కారానికి కృష్ణా జలాలు తీసుకొచ్చేందుకు చేపట్టిన హంద్రీ-నీవా కాలువ పనులు నత్తనడకన జరుగుతుండటంతో నీటికి కష్టాలు తప్పడం లేదు. దశాబ్ద కాలంగా గిడిగి, కైగల్ నీటి ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. దీనితో వందలాది ఎకరాల వ్యవసాయ భూములు నీటి కొరతతో బీడు భూములుగా మారి రైతులు కూలీలుగా మారిపోయారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి వేసవిలో సీజనల్ పంటలైన టమాటా, అరటి, బొప్పాయి, బంగాళాదుంప పంటలను సాగుచేసిన రైతులు వాటిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చెరువులు కబ్జాలకు గురికావడం ఇంకుడు గుంతలు నిర్మాణం సక్రమంగా చేపట్టకపోవడంతో పాటు చెక్ డ్యాంల నిర్మాణంలో అలసత్వం కూడా భూగర్భ జలాలు పడిపోవడానికి కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు.




అటవీ ప్రాంతంలో మూగజీవాలకు నీరందిస్తున్న స్వచ్ఛంద సేవకులు

దాహంతో అలమట్టిస్తున్న జీవాలు...
మండల పరిధిలో గల అటవీ ప్రాంతాల్లోని వన్యప్రాణులకు నీటి కష్టాలు తప్పడం లేదు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో నీటి వనరులు తగ్గిపోవడంతో సమీప గ్రామాల వైపు జంతువులు నీటి కోసం తరలివస్తున్నాయి. దీంతో రైతులు పంటలను కాపాడుకోవడం కోసం నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది స్వచ్ఛంద సేవకులు బాటిల్లతో అటవీ సమీపంలో కోతులకు ఇతర వన్యప్రాణులకు నీటిని అందిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు వీటి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.


నీళ్లు లేక ఎండిపోతున్న మామిడి చెట్లు


నీరు లేక ఎండిపోయిన బైరుపల్లి పెద్దచెరువు

తాగునీటి సరఫరాకు నిధుల కొరత...
గ్రామ పంచాయతీలలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సర్పంచులకు నిధులు కొరతతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ప్రారంభంలోనే అనేక గ్రామాల్లో తాగునీటి బోర్లు అడుగంటిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అప్పులు చేసి అవస్థలు పడుతున్నారు. కొన్ని బోర్లలో అదనపు పైపులు వేసినా ఫలితం లేకపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర నీటిని తోడేందుకు పెట్టిన మోటర్లు సైతం కాలిపోతుండడంతో వాటిని బయటకు తీసి మరమ్మతులు చేసి మరలా దించేందుకు ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి, దీంతో గ్రామపంచాయతీలలో నిధులు లేకపోవడంతో సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ జిల్లా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.


నీటి సమస్యను పరిష్కరిస్తాం
- విశ్వనాథ్, సర్పంచ్, బోడిగుట్లపల్లి..



ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేస్తే తాగునీటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తాం. ప్రజలకు జీవించేందుకు ప్రాణాధారం నీరు. కావున రాజకీయాలతో సంబంధం లేకుండా ఎన్నికల నిబంధనలు సాకు చూపకుండా తక్షణం ప్రభుత్వం తాగునీటి సమస్యలు పరిష్కారానికి వెంటనే ప్రత్యేక నిధులు విడుదల చేయాలి. రానున్న వేసవిలో మరింత నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ట్యాంకర్లు, బోరు మోటర్ల మరమ్మతులు, నూతన బోర్ల ఏర్పాటుపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి.

ఎన్నికల ప్రవర్తన నియమావళి

ఉల్లంఘనపై చర్యలు చేపట్టాం: కలెక్టర్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి అందే ప్రతి అంశంపై చర్యలు చేపట్టడం జరుగుతున్నదని, రాజకీయ పార్టీలు ప్రచారానికి నిర్దేశించిన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలియజేశారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎంసిసి స్టాండింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి వచ్చే ప్రతి అంశంపై క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు ఆయా రాజకీయ పార్టీలు ప్రచార సందర్భంలో ముందస్తు అనుమతి తప్పనిసరి అని, అయితే ఇందుకు 48 గంటలు ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు, 85 సంవత్సరాలు పైబడ్డ వారికి హోం ఓటింగ్ విధానంపై కసరత్తు చేయడం జరుగుతున్నదని, హోం ఓటింగ్ విధానం అమలు విధానంను రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. అదేవిధంగా రాజకీయపార్టీల ప్రకటనలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో అనుమతులను ఎంసీఎంసీ ద్వారా పొందాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోని టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్ప్లేలు వాయిస్ మెసేజ్‌లు ప్రచారానికి అనుమతి తప్పనిసరి అన్నారు. డీజే ప్రచార వాహనాల ద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్కువ శబ్దంతో ప్రచారాలు నిర్వహించుకోవాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీలు ఇంటింటి ప్రచారానికి సంబంధించి ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధనను పునఃసమీక్షించాలని, ఈఅంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొని రాగా.... ఈ అంశాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. కరపత్రాల పంపిణీకి సంబంధించి కూడా ముందస్తు గానే అనుమతి తీసుకొని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ట్రేడ్ యూనియన్ వద్ద జెండాలను తొలగిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొని రాగా ఈ అంశంను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలోగల కమాండ్ కంట్రోల్ రూమ్ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని కోరగా కమాండ్ కంట్రోల్ రూమ్ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి డిఆర్‌ఓకు సూచించారు. రాజీనామా చేసిన వలంటీర్లు వారికి కేటాయించిన మొబైల్స్, సిమ్‌కార్డు వివరాలను సంబంధిత అధికారులకు అందజేయాలని తెలుపగా.. జిల్లా ఎన్నికల అధికారి స్పందిస్తూ.. రాజీనామాపత్రాన్ని ఆమోదించిన తర్వాతనే వలంటీర్ల తొలగించినట్లు అవుతుందని, మొబైల్, సిమ్ కార్డులను తీసుకొనే విధంగా ఆదేశాలు ఇస్తామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గ ఆర్ఓ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి అట్లూరి శ్రీనివాస్, సిపిఎం వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ భాస్కర్, టిడిపి సురేంద్ర కుమార్, వైఎస్ఆర్‌సిపి ఉదయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరులో తెలంగాణ సైబర్ పోలీసుల సోదాలు

వివరాలు వెల్లడించేందుకు నిరాకరణ



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరులో ఆన్లైన్ వ్యాపారం అంటూ మోసాలకు పాల్పడుతున్న కార్యాలయాలు అనేకం ఉన్నాయి. డిజిటల్ వ్యాపారంలో లక్షలు పెట్టుబడి పెట్టి స్కాములు జరుగుతున్న పుంగనూరు పోలీసులకు మాత్రం ఇవేవీ పట్టీపట్టనట్లు ఉన్నారు. ఇందుకు ఉదాహరణే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం పుంగనూరులో సోదాలు నిర్వహించారు. గతంలో కూడా పుంగనూరులో ఆన్‌లైన్ వ్యాపారాల ద్వారా కోటి రూపాయలు పోగొట్టుకున్నట్లు హైదరాబాదు వాసి సైబర్ పోలీసులకు కేసు పెట్టారు. అప్పట్లో ఈ సంఘటనపై లద్దిగం గ్రామానికి చెందిన చరణ్ అను వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల్లోని హైదరాబాదుకు చెందిన మరొకరు మోసపోవడం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో వారు పుంగనూరులో రహస్యంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కడప లాడ్జీ పక్క వీధిలో ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ముందు ఆన్లైన్ ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకుడిగా మురళి అనే వ్యక్తి ఉన్నాడు. ఇతను తక్కువ పెట్టుబడితో అధిక లాభం ఇస్తామంటూ ఆన్లైన్లో మోసాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. వీరి ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారికి అసలు కూడా చేరకపోవడంతో మోసపోయామని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనపై పుంగనూరులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వారి కార్యాలయాలలో రహస్యంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై సిఐ రాఘవరెడ్డిని వివరణ కోరగా సైబర్ క్రైమ్ కింద పుంగనూరులో ట్రేడింగ్ కంపెనీ పై కేసు నమోదు అయిందని వివరాలు తెలీదని చెప్పారు. అయితే సైబర్ క్రైమ్ ఎస్పై ఈ కేసు విషయమై వివరణ కోరగా వివరాలు చెప్పేందుకు వీలుపడదని సున్నితంగా తిరస్కరించారు. సైబర్ క్రైమ్ నేరాలలో కేసు నమోదైన అక్యూజుడ్ నుండి లబ్ధి పొంది కేసును నీరు కార్చే సందర్భాలు కూడా లేకపోలేదని పోలీస్ స్టేషనులో వినబడిసిన గుసగుసలు ఇవి. దీనిని బట్టి చూస్తే కేసు నమోదు అవుతుందా..? ఆమ్యామ్యాలతో మేనేజ్ చేసుకుంటారా అనే పలు రకాల అనుమానాలకు తావిస్తున్నాయి. సైబర్ కేసులు బలహీన పడితే మాత్రం తిరిగి ఇలాంటి నేరాలు పునరావృతం అవుతుంటాయి.

అంగన్వాడీ సెంటర్లు ఒంటిపూట నిర్వహించాలి

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రోజురోజుకి ఎండలు అధికమవుతున్న సందర్భంగా అంగన్వాడీ సెంటర్లను ఉదయం 8 నుండి 12.30 గంటల వరకు నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున అంగన్వాడీ కేంద్రానికి ఒంటి పూట బడులు నిర్వహించే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మె కాలం వేతనాలు ఇవ్వడానికి జీవో విడుదల చేసిందని దానిని వెంటనే అమలు చేసి వేతనాలు ఇచ్చి అంగన్వాడీలను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో అనేక ప్రాజెక్టులలో అర్హులైన హెల్పర్లకు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ప్రభుత్వ జీవో ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, కొన్ని ప్రాజెక్టుల్లో మినీవర్కర్లకు వేతనాలు పడలేదని ఆ సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాజెక్టులలో వర్కర్లపై కొంతమంది అధికారులు కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని మానుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కదలిరండి.. ఓటు వేయండి... ప్రతి ఓటు ముఖ్యమైనదే.. అంటూ ఇటుకల బట్టీలో పనిచేసే ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు నగరపాలక నోడల్ టీం. గురువారం నగరపాలక పరిధిలోని సాంబయ్య కండిగ వద్దనున్న ఇటుకల బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. బట్టిల్లోని ఓటర్లు సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని చైతన్య పరిచారు. స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి, ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య, టీం సభ్యులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి ఘనస్వాగతం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో గురువారం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి చర్చించారు. కార్వేటినగరంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఎంపీ రెడ్డప్పకి ఎంపీపీ లతాబాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, సర్పంచ్‌లు ధనశేఖర్ వర్మ, గుణవతి లోకానందం నాయుడు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ కలసికట్టుగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పనిచేసి వైసిపి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్పకి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూ కృపాలక్ష్మిల గెలుపుకు కృషి చేయాలని కోరారు.

నేడు బీసీలతో సమావేశం

టిడిపి మండల అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈనెల 29వ తేదీ శుక్రవారం మండలంలోని బీసీలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కీరమంద, పెరుమాళ్ళపల్లి, చికూరుపల్లి గ్రామాల్లో బీసీలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీసీలు మహేంద్ర గౌడు, జనార్దన్ గౌడు, నాగరాజు గౌడు పాల్గొన్నారు.

కార్యకర్తలే... మూలస్తంభం ..

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే వైఎస్ఆర్సిపి పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి మిట్ట దీపిక కళ్యాణ మండపంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీలో గల రామనపల్లి గ్రామంలో గురువారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి నవీకరణ జీర్ణోద్ధారణ, మహాగణపతి ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ కృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపీపీ ఏం.రెడ్డప్ప, దయానంద గౌడ్ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈఎంసి అమలులో ఉంది : డీటీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మోడల్ ఆఫ్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని డిప్యూటీ తహశీల్దార్ ఇబ్రహీం అన్నారు. గురువారం మండలంలోని పాలేరు ఫ్లైఓవర్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో నగదు వస్తువులను తరలించేందుకు పూను కుంటున్నారని వాటిని నివారించేందుకు కోసం ఎన్నికల తనిఖీ చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉన్నదని ప్రతి వ్యక్తి దగ్గర 50 వేల రూపాయలకు పైన నగదున్న ఎన్నికల నియమావళి ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అదే విధంగా ఎన్నికలలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ వస్తురూపమైన పంపిణీలు చేపట్టేందుకు తరలిస్తున్న వాటిని స్వాధీనం చేసుకునేందుకు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారని పట్టుబడిన వి ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం కేసులు నమోద చేసి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతుందన్నారు ఈ కార్యక్రమంలో పోలీసులు రమేష్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మాతా శిశు ఆరోగ్యం ముఖ్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ మేనేజ్మెంట్' అనే అంశంపై గురువారం రెండవ రోజు జిల్లాలోని ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హాస్పటల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజిస్టు, వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణను స్టేట్ కన్సల్టెంట్లు అగు డాక్టర్ అన్వేష్, డాక్టర్ శ్రావ్యల ద్వారా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజ ఆరోగ్యానికి 'మాతా శిశు ఆరోగ్యమే ముఖ్యం' అని, ఆరోగ్యానికి మొట్టమొదటి కొలమాణికం ఇదే అని అన్నారు. కనుక సమాజంలో ఉండే హైరిస్క్ గర్భిణీ స్త్రీలను ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో ఎలాంటి తప్పిదలకు గురి కాకుండా సులభ కాన్పుతో పండంటి బిడ్డకి జన్మనించేలా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అన్ని విషయాలను మీ ప్రాంతంలోని ఎమ్మెల్ హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు నేర్పించి మాత శిశు మరణాలు లేని సమాజ స్థాపనే మన ధ్యేయంగా పయనించాలని తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ మీనా షయ్యద్, డాక్టర్ జానకిరావు, డాక్టర్ శిరీష, పాల్గొన్నారు.

బీజేపీతో వైసీపీ అనైతిక పొత్తు: అబ్దుల్ రహీం



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వైసీపీ ఐదేళ్లుగా బీజేపీతో అనైతిక పొత్తులో ఉందని టీడీపీ మైనారిటీ విభాగం నాయకులు అబ్దుల్ రహీం పేర్కొన్నారు. గురువారం ఆయన టీడీపీల కార్యాలయంలో మైనారిటీ విభాగం నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ నాయకులు తాము బిజెపితో పొత్తు పెట్టుకున్న విషయాన్ని తప్పు పడుతూ ముస్లిం వర్గాల ప్రజలను మభ్యపెడుతూ వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మాత్రమే టీడీపీ ఎన్డీఏ కూటమిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, ఆలీ హుస్సేన్, నాజర్, ఔరంగ్ బాషా, మోబిన్ పాల్గొన్నారు.

సమాజంలో రోవర్లు, రేంజర్ల పాత్ర కీలకం



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమాజంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి చెందిన రోవర్లు, రేంజర్ల చాలా కీలకమనీ, ఆసక్తి గల వారు సంస్థలో చేరాలని జిల్లా రోవర్ల కార్యాలయ కమీషనర్ టి.రమేష్ బాబు అన్నారు. డిగ్రీ విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో చేరి ఉత్తమ పౌరులుగా మారాలన్నారు. శ్రీకాళహస్తిలోని ఎస్వీయే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవభావం పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ చాలా దోహదపడుతుందన్నారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనేందుకు విద్యార్థులు ముందుకు రావాలని ప్రిన్సిపాల్ కోరారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సేవలందించిన రోవర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేంద్రుడు, లీడర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి ఉపవిద్యాశాఖ అధికారి ఎం.ఆనంద్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా అపుస్మా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ.శేఖర్ ఆధ్వర్యంలో జ్ఞాపికను అందచేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా రాయలసీమ జోన్ అద్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి, జిల్లా అద్యక్ష కార్యదర్శులు బి.రవీంద్రరెడ్డి, ఓబుల వెంకటరమణ రెడ్డి, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఈవో, అపుస్మా నాయకులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- అనధికారికంగా దుకాణం ఏర్పాటు
- స్పందించిన అధికారులు
- తక్షణమే తొలగిస్తామని వెల్లడి

ప్రజాశక్తి-కోట: కోట పంచాయతీ కేంద్రంలో ఓ వ్యాపారస్తుడు ఏకంగా ప్రభుత్వ స్థలాని ఆక్రమించి దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. స్థానిక గోపాల్‌రెడ్డి విగ్రహం సమీపంలో శ్రీకోటమ్మ గుడికి వెళ్లే రోడ్డుకు ఎడమవైపున ఆర్చి, చెట్టును ఆదారం చేసుకొని దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. ఒక వైపు పట్టణంలో దురాక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల్లో అధికారులు తిరిగి అక్రమాలు తొలగిస్తున్నారు. తాగాజా ఓ వ్యాపారస్తుడు అక్కడ దుకాణం ఏర్పాటు చేయడంతో అధికారులు, స్థానికులు ఆశ్చర్యపోయారు. ఉన్న ఆక్రమణలు తొలగిస్తుంటే



కొత్తగా మరో దుకాణం ఏర్పాటు చేయడం ఎంటని స్థానికులు మండిపడుతున్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తాం..

అక్రమంగా ప్రభుత్వ స్థలంలో దుకాణాన్ని ఏర్పాటు చేసిన వారితో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకుంటాం. అక్కడ నుంచి ఆక్రమణలు తొలగిస్తాం..

శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని గోట్టికాడు గ్రామంలో నేల రోజులగా ఉన్న తాగునీటి సమస్యను మండల విస్తరణాధికారి శ్రీనివాసులు గురువారం పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి సంబంధించిన పైపులేన్ గత నెలరోజుల క్రితం పగిలిపోయింది. గ్రామంలో తాగునీటికి అల్లాడుతున్నామని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకు రావడంతో జెసిబి తీసుకొచ్చి పైపులైను మరమ్మతులు చేయడం జరిగిందని చెప్పారు. సచివాలయం పరిధిలో ఏఏ గ్రామాలు ఉన్నాయో ఆ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సచివాలయం సిబ్బందికి ఆదేశించారు.



జెసిబితో పైపులైను పనులు చేపడుతున్న అధికారులు

జగన్‌కు బీసీలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్

ప్రజాశక్తి- యాదమరి: ఏపిలో హిట్లర్ పాలనను జగన్ సాగిస్తున్నాడని పూతలపట్టు టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ వైసిపి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం యాదమరి మండలం, క్లస్టర్-10 పరిధిలోని దళవాయిపల్లె గ్రామంలో జయహో బీసీ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చౌదరి, పూతలపట్టు అభ్యర్థి డాక్టర్ మురళిమోహన్ పాల్గొన్నారు. మురళిమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి బీసీలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందన్న విషయం ప్రతి బీసీ గుర్తించుకోవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి బీసీలపై వైసిపి నాయకులు దుర్మార్గంగా ప్రవర్తిస్తూ అణిచి వేసేందుకు ప్రయత్నం చేస్తుందని, అందుకే బీసీలు, మైనారిటీ, ఎస్సీల్లో మార్పు రావాలని కోరారు. కేవలం, బీసీలకే కాకుండా మైనారిటీలు, ఎస్సీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీ టిడిపి ఒక్కటే అన్నారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా నిలబడిన సునీల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక్కసారైనా ప్రజల సమస్యలు పట్టించుకున్నారా అంటూ ప్రశ్నించారు. మాయ మాటలు, మోసకారితనం చూసి ఓట్లు వేసే రోజులు పోయాయని ప్రతి బీసీ వైసీపి నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి మహదేవ్ సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, యాదమరి మండల అధ్యక్షులు మురాజీ యాదవ్ పాల్గొన్నారు.



విశ్రాంతి ఉద్యోగులు

సమాజ సేవాకు కృషి చేయాలి: భూమన్



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: శ్రాంతి ఉద్యోగులు సమాజ సేవకు కృషి చేయాలి అని భూమన్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు మాట్లాడుతూ సమాజ సేవ కార్యక్రమాలలో, సాహిత్య వేదికల పైన విశ్రాంత ఉద్యోగులు సంఘం చేసే అనేక సత్కార్యాలుకు చేయూత నిచ్చిన డైరెక్టర్ ఐకాన్ సాఫ్ట్వేర్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై శోభరాజ్ ఎంతో అభినందనీయులు అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం, సంస్కార ఫౌండేషన్ తిరుపతి ప్రతినిధులు రాకేష్‌కుమార్, శ్రీనివాసమూర్తి, మహిళా సభ్యులు శోభరాజ్ ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృపావరమ్మ, యుగంధర్‌రాజు, రవిశంకర్, కుప్పయ్య, రామలింగం, బాలసుబ్రమణ్యం, మునికృష్ణయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడేపింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కోట: వలంటీర్లు ఎన్నికల నిబంధ నలకు లోబడే పింఛన్‌లు పంపిణీ చేయాల్సి ఉంటుందని ఎంపీడీవో శంకరయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1న పింఛన్‌లు లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటిం చాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి ప్రలోభా లకు పాల్పడకూడదని హెచ్చరించారు.

గౌడ సంఘం

నియోజకవర్గ అధ్యక్షులుగా వెంకటేష్

ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ గౌడ సంఘం అధ్యక్షులుగా వెంకటేష్ గౌడ్ ని నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకటించారు. వెంకటేష్‌గౌడకి పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియమించడం సంతోషంగా ఉందని వెంకటేష్ అన్నారు. శ్రీహరి, మురళిగౌడ్ పాల్గొన్నారు.

'అవగాహనతో ఓటు వినియోగించుకోండి'

ప్రజాశక్తి-వాకాడు: ప్రతి పౌరుడూ అవగాహనతో ఓటు వినియోగించుకోవాలని తహశీల్దార్ నరసింహరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీనాథ్, ఎంఈవో నరసింహులి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సెల్

అధ్యక్షులుగా రహంతుల్లా

ప్రజాశక్తి-నాయుడుపేట: వైసీపీ నాయుడుపేట మైనారిటీ సెల్ అధ్యక్షులుగా షేక్ రహంతుల్లా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన సూళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్ యాదవ్, మల్లికార్జున్ రెడ్డి, నాగిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి, రాహుల్, భాస్కర్ రెడ్డి, సాధు మోహన్, అనుదీప్ పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం: విజయశ్రీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: సూళూరుపేటలో టీడీపీ విజయానికి కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంతో కలిసి ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సి ఉందన్నారు. నాయకులు శ్రీనివాసులు, కాళయ్య, వెంకటాచలం, చంద్రయ్య, శీనయ్య, పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు నాయుడు, జకరయ్య, శ్రీహరి రెడ్డి, రత్నయ్య, విజయ్, ప్రమీల, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-గూడూరుటౌన్: గూడూరు పట్టణానికి చెందిన పలువురు నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తిరుపతిని అభివృద్ధి చేస్తా.. : ఆరణి

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: తిరుపతిని అభివృద్ధి చేస్తా.. ప్రజలంతా ఆశీర్వదించాలని జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం జీవకోన డివిజన్‌లోని విశ్వం స్కూల్, క్రాంతి నగర్, జీవలింగేశ్వర్ స్వామి ఏరియా, శివ జ్యోతి నగర్, సత్యనారయణ పురం సర్కిల్‌లలో ఇంటింటి ప్రచారం చేశారు. దోశలు వేసే ఓ పెద్దమ్మ నుంచి పిండి తీసుకుని స్వయంగా దోశ వేశారు. శివ జ్యోతి నగర్‌లో బట్టలను ఇస్త్రీ చేశారు. పారిశుధ్య కార్మికులతో ముచ్చటించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, చిన్ని, పవన్, భాను, తులసి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అభినయ్‌ని గెలిపించండి: భూమన

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: తిరుపతి ఎమ్మెల్యేగా భూమన అభినయ్‌రెడ్డిని గెలిపించాలని తిరుపతి ఎమ్మెల్యే, టీడీపీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కోరారు. గురువారం 36, 37 డివిజన్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ ప్రవేశ పెట్టి అమలు చేసిన పథకాలను తిరిగి చేపట్టబోయే అభివృద్ధిని వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, నాయకులు ప్రతాప్ రెడ్డి, సిద్ధారెడ్డి, గోపీ యాదవ్, బాబు, గీతా, వెంకటేశ్వర్లు, మునిరామి రెడ్డి, శ్యామల, నరసింహా తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీల్లో నగదు సీజ్

ప్రజాశక్తి- సోమల:



నగదు లెక్కిస్తున్న పోలీసులు

మండల కేంద్రమైన సోమల సినిమా క్రాస్ వద్ద ఎస్సై వెంకట నరసింహులు ఆధ్వర్యంలో ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పోలీసుల తనిఖీలు బెంగళూరు నుండి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి వద్ద ఉన్న రూ.77,140లు నగదు, మరొక ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి వద్ద నుండి రూ.90 వేలు మొత్తం ఒక లక్ష 67 వేల 140 రూపాయల నగదు సరైన రికార్డులు, బిల్లులు చూపనందున ఎంసిసి రూల్స్ ప్రకారం సీజ్ చేసి ఐటీ శాఖకు జమ చేసినట్టు ఎస్సై తెలిపారు. ఆయన మాట్లాడుతూ సరైన బిల్లులు లేకుండా రికార్డులు లేకుండా నగదు తీసుకెళ్తూ తనిఖీలలో పట్టుబడితే సీజ్ చేయడం జరుగుతుందని, సరైన పత్రాలు కలిగిన వారు పోలీసుల తనిఖీలలో రికార్డులు చూపి నగదు సీజ్ కాకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ రైతు పాటు కాటుకు గురై మరణించిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన బి.రమణప్ప (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మధ్యాహ్నం పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. పనిలోనిమగ్నమైన రైతును పాము కాటువేసింది. గమనించిన స్థానికులు ఆయన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణప్ప మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. రైతులు మృతి విషయం తెలుసుకున్న సర్పంచ్ చంద్రమౌళి, విఆర్ఓ గోపాలకృష్ణ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరి ధిలోని తిమ్మినాయుడుపాలెం సమీపంలో 6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆ యన వివరాలను వెల్లడించారు. బుధవారం తిమ్మినాయుడుపాలెం అటవీ ప్రాంతంలో కూ ంబింగ్ చేపట్టగా గురువారం ఉదయాన్నే బయోట్రిమ్ వద్ద లగేజీ వాహనంలో ఎర్రచం దనం లోడ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. దాడి చేసి లగేజీ వాహనం, బైక్‌ను సీజ్ చేశామన్నారు. అక్కడే 6 దుంగలు స్వాధీనం చేసుకొని తిమ్మినాయుడుపాలెంకు చెందిన పవన్(23)ను అదుపులోకీ తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్‌షో విజయవంతమైంది: భాను



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: చంద్రబాబు నాయుడు తలపెట్టిన ప్రజాగళం రోడ్ షో విజయవంతం కావడానికి కృషి చేసిన శ్రేణులకు, తరలివచ్చిన ప్రజలకు టీడీపీ నగరి అభ్యర్థి గాలి భాను కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విశేష సంఖ్యలో ప్రజలు హాజరై టీడీపీ మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు.

నారాయణవనంలో దొంగల భయం

- కలవరపెడుతున్న వరుస చోరీలు
- రాత్రైతే కునుకు ఉండట్లేదంటున్న స్థానికులు
- పోలీసుల గస్తీ పెంచాలని వేడుకోలు



ప్రజాశక్తి-నారాయణవనం: వరుస దొంగతనాలు, గుర్తు తెలియని వ్యక్తుల సంచారంతో నారాయణవనం వాసులకు కంటిమీద కునుకు కరువైంది. గత కొంత కాలంగా రాత్రిపూటల్లో, ఒంటరిగా ఉంటున్న వారి ఇళ్లనే టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు వరుస ఫిర్యాలు అందుతున్నా చర్యలు లేకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కావడంతో ఇళ్లలో ఉక్కపోతకు ఆరుబయట, మేడలమీద ఉంటున్న సమయంలో దుండగులు ఇళ్లలోకి చొరబడి విలువైన వస్తువులు అపహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సోమవారం రాత్రి నారాయణవనం జంక్షన్ వద్ద మీనాక్షి అనే మహిళ ఇంట్లోకి గుర్తు తెలియని యువకులు కార్లోవచ్చి, డబ్బు, వెండి కవచాలు దోచుకెళ్లారు. ఇప్పటికే ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పగలంతా గస్తీ ఉంటూ రాత్రిల్లో టార్గెట్ పెట్టి ఇళ్లలోకి చొరబడుతున్నట్లు తెలుస్తోంది. దొంగతనాలపై పోలీసులకు పూర్తి స్థాయి సమాచారం ఉన్నా అప్రమత్తం కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. రాత్రిల్లో నామమాత్రంగా గస్తీలు చేపడుతున్నారని పలువురు వాపోతున్నారు.

గస్తీ పటిష్టం చేస్తాం..

నారాయణవనం మండలంలో జరుగుతున్న దొంగతనాలపై నిఘా ఉంచాం. రాత్రిల్లో గస్తీ మరింత పటిష్టం చేస్తాం. ప్రత్యేకంగా రౌండ్స్ వేస్తూ దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

లక్ష్మీనారాయణ, ఎస్ఐ, నారాయణవనం

వైసిపి నుంచి టిడిపిలోకి భారీ వలసలు

ప్రజాశక్తి- యాదమరి: మండల అధ్యక్షుడు మురాజీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ ఆధ్వర్యంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్‌రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్‌ల సమక్షంలో తెల్లరాళ్లపల్లి సర్పంచ్ బజలింగం, వైసీపి వార్డు మెంబరు పి.ధనశేఖర్‌తో పాటుగా వైస్ సర్పంచ్ బి.సుబ్రహ్మణ్యం, ఎక్స్ ఆర్మీ వరదరాజులుతో పాటు పలువురు, 30 కుటుంబాలకు పైగా తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వీరికి మురళిమోహన్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

పలమనేరు: పట్టణంలోని 22, 23 వార్డులకు చెందిన పలువురు వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీమంత్రి అమర్నాథరెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అమరనాథరెడ్డి వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గంగవరం: మండలంలోని డ్రైవర్స్ కాలనీలో వైసిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న స్వాతి, కిరణ్‌ల ఆధ్వర్యంలో దాదాపు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గురువారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కుప్పం : మండలంలోని చందం పంచాయతీ చందం దళిత వాడ ప్రజలు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగం కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, రాజ్‌కుమార్, రాధాకృష్ణులు పార్టీ కండువాలు కప్పి సాధారణంగా స్వాగతించారు.